రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


దుబ్బాక: శిలాజీనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


మిరుదొడ్డి: మోతెలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించం
- కూడవెల్లి వాగులోకి నీళ్లు ఎందుకు వదలడం లేదు
- ప్రజల సంక్షేమం కోసం దేనికైనా సిద్ధం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 17 : రైతులు, పేదలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లివాగులోకి నీరు విడుదల చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం దుబ్బాక మండలం శిలాజీనగర్ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే బీఆర్ఎస్‌తో పెట్టుకోవాలని, అమాయక రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుత పంటలకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఫోన్ చేస్తే కాల్వల ద్వారా సాగునీరు అందించామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రైతులను ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. తెలంగాణ సాధించుకున్నది.. నీళ్లు, నిధులు, నియామకాల కోసమేనని గుర్తుచేశారు. సాగునీటి కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తే మరో ఉద్యమం తప్పదన్నారు. ప్రజల సంక్షేమం కోసం అవసరమైతే జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు. ప్రపంచ స్థాయిలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఆ ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రాజెక్టులు కట్టుకున్నదే సాగునీటి కోసమని, పంటలకు సాగునీరు సరఫరా చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు మనోహర్ రావు, రాజమౌళి, ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జనవరి 17: పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో ఎస్సీ, బీసీ కులాలకు చెందిన కమ్యూనిటీ హాల్స్, కూడవెల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం, అక్బర్‌పేటలో పల్లె దవాఖాన సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మోతె గ్రామంలోని వేంటేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బొంపల్లి మనోహర్‌రావు, బీఆర్ఎస్ యువత విభాగం రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గ్రామాలను ప్రతి రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మా.. నీకు పింఛన్ వస్తుందా?

మోతెలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఇంటి వద్ద కూర్చున్న వృద్ధులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. అమ్మా బాగున్నావా? ఆరోగ్యం ఎలా ఉంది.. పింఛన్ వస్తుందా? అని వృద్ధురాలు రాజవ్వను ఎమ్మెల్యే అడిగారు. వృద్ధురాలు మాట్లాడుతూ సార్.. గిప్పుడైతే ఆరోగ్యం మంచిగానే ఉంది. నాకు పింఛన్ వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు, సర్పంచులు శ్రీనివాస్, సుగుణానర్సింహులు, స్వరూపాభిక్షపతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు లింగం, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేశ్వర్, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కృతజ్ఞతా సభ

గజ్వేల్, జనవరి 17: గజ్వేల్ పట్టణంలోని శోభ గార్డెన్‌లో నేడు (గురువారం) ఉదయం 10 గంటలకు నిర్వహించే బీఆర్ఎస్ కృతజ్ఞతాసభకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నట్లు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించుకున్న సందర్భంగా కృతజ్ఞతా సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సర్పంచుల పదవీకాలం పొడిగించాలి

అక్కన్నపేట, జనవరి 17: పదవీకాలాన్ని పొడిగించాలని మండలంలోని పలువురు సర్పంచులు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి ఒకటితో ముగియనుందన్నారు. అయితే, తమ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించారని, తమను కూడా అదేవిధంగా రెండేండ్ల పాటు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాజీ జడ్పీటీసీ బీలూనాయక్, సర్పంచులు జిల్లెల అశోక్‌రెడ్డి, గద్దల రమేశ్, గుడాల సంపత్, మాలోతు రాజు, బానోతు రవీందర్, కరి వేద నరేందర్‌రెడ్డి, కత్తుల శంకర్, సందబోయిన కుమార్ పాల్గొన్నారు.

మిరుదొడ్డి పెద్దచెరువులో సీతారామచంద్రస్వామివారి తెప్పోత్సవం

ఘనంగా తెప్పోత్సవం

మిరుదొడ్డి, జనవరి 17 : మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 17 వరకు గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం సీతారామచంద్రస్వామి ప్రతిమలను గ్రామంలో భజన కీర్తనల మధ్య ఊరేగించారు. అనంతరం పెద్ద చెరువులో సీతారామచంద్రస్వామి విగ్రహాలతో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీ అనురాధకు మల్లన్న చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్, ఈవో

సీపీని కలిసిన కొమురవెల్లి ఆలయ చైర్మన్

చేర్యాల, జనవరి 17: సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను బుధవారం కొమురవెల్లి ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి మల్లన్న చిత్రపటాన్ని అందజేశారు. ఈనెల 21న మొదటి ఆదివారంతో పాటు ఏప్రిల్ 8 వరకు జరిగే మల్లన్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు, రక్షణ ఏర్పాట్లపై సీపీతో చైర్మన్, ఈవో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుందన్నారు. త్వరలోనే కొమురవెల్లి మల్లన్న క్షేత్రాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

సునీత టీచర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఉదారత

సిద్దిపేట కమాన్, జనవరి 17 : తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు సిద్దిపేట నేతాజీ పబ్లిక్ స్కూల్ పూర్వవిద్యార్థులు. నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో పనిచేసిన టీచర్ సిరిసిల్ల సునీత కుమారుడు కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నేతాజీ పబ్లిక్ స్కూల్ 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి వంగ మహేందర్‌రెడ్డి, సింగోజి జనార్దన్, 1997 బ్యాచ్‌కి చెందిన శ్రీకాంత్‌రెడ్డి కలిసి టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని పూనుకున్నారు. అనుకున్నదే తడువుగా తమ స్నేహితులతో మాట్లాడి రూ.63 వేలు సమకూర్చి ఆ ఆర్థిక సాయాన్ని సిరిసిల్ల సాయిచరణ్ భార్య ప్రసన్నకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంగదాంపల్లి శ్రీను, వంగ శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, రాము, లక్ష్మణ్, ఆనంద్, రోహిణి, పరమేశ్వరి, సంగీత, భాగ్యలక్ష్మి, దయానంద్, సోమేశ్వర్, సురభి ప్రవీణ్, నాయకం ప్రసాద్, విజయ భాస్కర్, కోల రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు వయస్సుకు తగ్గ బరువు ఉండాలి

అంగన్‌వాడీ కార్యకర్తలను వివరాలు అడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కోహెడ, జనవరి 17 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు వయస్సుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం మండంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు నాణ్యమైన ఆహారం తీసుకునేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. సమయానికి తగిన విధంగా పిల్లలకు ఆహారం అందించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఎంపీడీవో మధుసూదన్, మండల వైద్యాధికారి నిమ్రా, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ సుతారి కళ్యాణి, సీడీపీవో జయ, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, ఉమ పాల్గొన్నారు.


బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి

విజేతలకు బహుమతుల ప్రదానం

గజ్వేల్, జనవరి 17: సంక్రాంతి పండుగ సందర్భంగా రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో పోస్టల్ ద్వారా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బహుమతుల అందజేశారు. బుధవారం పట్టణంలోని కృష్ణాలయంలో ప్రథమ బహుమతి వేములవాడ చందన, ద్వితీయ బహుమతి తీర్థాల విజయలక్ష్మి, తృతీయ బహుమతి పొద్దుటూరి ప్రేమలతకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగు సంస్కృతిక, సంప్రదాయాలు అద్దం పట్టేలా మహిళలు చక్కగా ముగ్గులు వేశారన్నారు. రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామకోటి రామరాజు, డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, రామచంద్రం, లక్ష్మయ్య, రామచంద్రం, మధు, నాగేంద్రం పాల్గొన్నారు.

సాగునీరు విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

సిద్దిపేట కమాన్, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18, 19, 20 తేదీల్లో అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి ఒక టీఎంసీ నీటిని పంపింగ్ చేయనున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసిన నీటిని కాల్వల ద్వారా రైతుల పంటలకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి రంగనాయకసాగర్ నుంచి పంట పొలాలకు సాగునీరు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి: సీపీ

సిద్దిపేట, జనవరి 17 : సైబర్ నేరగాళ్ల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్ టైమ్ జాబ్, విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్‌కార్డ్ అప్‌డేట్, ఆధార్‌కార్డు లింక్ పేర్లతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎవరైనా మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు. ఇప్పటివరకు రూ.6,43,805 ఫ్రీజ్ చేశామని, త్వరలో విడతల వారీగా సంబంధిత బాధితుల అకౌంట్స్‌లో డబ్బులు జమ అవుతాయన్నారు. ఈ-మెయిల్స్ ద్వారా వచ్చే ఉద్యోగ ప్రకటనలు, నకిలీ ఈ-మెయిల్ ఐడీలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనధికార లింక్‌లను నొక్కితే మీ ఫోన్ హ్యాకర్ కంట్రోల్‌కు వెళ్తుందన్నారు. లక్కీడ్రాలో ఎంపికైనట్లు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రమేశాచార్యులు

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

అక్కన్నపేట, జనవరి 17: మండలంలోని కేశవాపూర్‌లో గాయత్రి మాత ఆశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ క్యాలెండర్‌ను బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ బ్రహ్మశ్రీ కందారపు రమేశాచార్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం, నాయకులు కొమురయ్య, వెంకట్రాది, యాదగిరి, లింగమూర్తి, బుచ్చిరామారావు, శ్రీనివాస్‌రావు, సంతోష్‌రావు, రాజేశం, సంపత్‌రెడ్డి, బలరాములు, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

'బండి'పై పీఎస్‌లో ఫిర్యాదు

హుస్నాబాద్, జనవరి 17: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై కాంగ్రెస్ నాయకులు హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నాలుగు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్సై తోట మహేశ్‌ను కాంగ్రెస్ శ్రేణులు కలిసి ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట, జనవరి 17: సిద్దిపేట మైనార్టీ బాలికల పాఠశాల, గర్ల్స్-1 కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఎంపీసీ, బైపీసీ ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుప్రియ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి (గురువారం) ఫిబ్రవరి 6 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 5వ తరగతిలో మైనార్టీలకు -51 సీట్లు, క్రిస్టియన్లకు -5 సీట్లు, సిక్కు -1, బుద్ధ -1, జైన -1, పార్సీ 1, నాన్‌మైనార్టీ 20 సీట్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు కూడా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ మైనార్టీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు www.tmreistelangana.cgg.gov.in ద్వారా లేదా టీఎంఆర్ఈఐస్ మొబైల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


అక్కన్నపేట: గౌరవెల్లి పాఠశాలలో సమావేశమైన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

అ'పూర్వ' సమ్మేళనం

అక్కన్నపేట, జనవరి 17: మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 1998-1999 బ్యాచ్ 7వ తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ ఒకచోట చేరి ఉల్లాసంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలను విడిచి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్‌జుబ్లీ వేడుకల పేరుతో పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలో ఘనంగా సన్మానించారు.

వేచరేణి వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చేర్యాల, జనవరి 17: మండలంలోని వేచరేణి గ్రామ శివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్తులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ శివారులోని వాగు అవతలి ఒడ్డున వైకుంఠధామంతో పాటు వ్యవసాయ భూములు ఉండడంతో నిత్యం రైతులు, గ్రామస్తులు వాగు మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో గ్రామస్తులెవరైన చనిపోతే వాగుపై ప్రవహించే వరద నీటిలో ప్రాణాపాయ స్థితిలో మృతదేహాలతో ఒడ్డుకు చేర్చి అంత్యక్రియలు చేస్తున్నట్టు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

మైనార్టీ గురుకులాల్లో...

గజ్వేల్, జనవరి 17 : మైనార్టీ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం(2024-25) ఐదో తరగతిలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌తోపాటు పాఠశాలలో స్వీకరిస్తామన్నారు. మైనార్టీ విద్యార్థులు ఐదో తరగతిలో చేరేందుకు ముందుగా వచ్చినవారికే సీట్లు ఇస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లక్కీడ్రా ద్వారా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో చేరేందుకు మొదటగా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనవని, ఎంపీసీ, బైపీసీలో 40శాతాన సీట్లు ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

తపాస్‌పల్లి డి-4 కెనాల్ పరిశీలన

కొండపాక, జనవరి 17: కొండపాక మండలానికి వచ్చే తపాస్‌పల్లి డి-4 కెనాల్ కాల్వను బుధవారం హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట చేతికి రావాలంటే కాల్వల ద్వారా చెరువుల్లోకి సాగునీరు విడుదల చేయాలని, లేకుంటే రైతన్నలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 2011లో కేసీఆర్ ప్రభుత్వం కొండపాక మండలంలోని 11 గ్రామాలకు సాగునీరు అందించేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా డి-4 కాల్వను నిర్మించిందన్నారు. రైతులకు సాగునీరు అందేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ కూలీల ద్వారా కాల్వలో పూడికతీత పనులు ప్రారంభించాలని సూచించారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన ఉద్యోగులు

గజ్వేల్, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశాన్ని బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మాదిగ ఉద్యోగుల సమైక్య సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని కోరారు. పీఆర్సీ నివేదికను వేగవంతం చేయాలని, నూతన విధివిధానాలతో ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల కాంట్రిబ్యూషన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల అప్పీల్‌ను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, నర్సయ్య, అయోధ్య, వెంకన్న, సత్యనారాయణ, జానయ్య, శంకరయ్య ఉన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

చేర్యాల, జనవరి 17: అభివృద్ధి కోసం కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి నిత్యం చౌకబారు విమర్శలకు దిగడం మానుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు హితవు పలికారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దచెరువు కట్టను అభివృద్ధి చేసేందుకు కొమ్మూరి కృషి చేస్తుంటే.. అది చూసి ఓర్వలేక సీపీఎం నాయకులు విమర్శలకు దిగడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు తుమ్మల పల్లి సంజీవులు, మంజే మల్లేశం, కాశెట్టి ఉపేందర్, సనాది భాస్కర్, ముస్త్యాల దామోదర్, దాసరి శ్రీకాంత్, అంబాల బుచ్చిరాములు, మామిడాల నాగరాజు, నర్ర రమేశ్, సాయి రాకేశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

బస్టాండ్‌లో కిక్కిరిసిన జనం

హుస్నాబాద్, జనవరి 17: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండుగ తర్వాత తిరుగు ప్రయాణం చేస్తున్న జనంతో బుధవారం బస్టాండ్ రద్దీగా మారింది. సెలవులు ముగిసి విద్యాసంస్థలు తిరిగి ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఒక బస్సు వచ్చిందంటే సుమారు రెండు బస్సుల్లో పట్టేంత జనం రెడీగా ఉంటున్నారు. దీంతో బస్సులో సీటు సంపాదించేందుకు ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హుస్నాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఉండడం విశేషం.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 17: మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేసీఆర్ ప్రభుత్వం అత్యధికంగా నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపసర్పంచ్ జయాకర్, అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.